## గెయిల్ శిక్షణా కేంద్రాన్ని పరిశీలించిన సిపిఒ

**ప్రజాశక్తి - మామిడికుదురు**

స్థానిక బోయి భీమన్న మానవ వనరుల (గెయిల్)శిక్షణ కేంద్రాన్ని చీఫ్ ప్లానింగ్ అధికారి పి.వెంకటేశ్వరరావు గురువారం పరిశీలించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరులు తదితర అంశాలపై ఆరా తీశారు. ప్రస్తుతం ఆయిదు బ్యాచ్ లకు శిక్షణ ఇస్తున్నామని గెయిల్ సీనియర్ మేనేజర్ హెచ్.ఆర్ ప్రభాకర్ తెలిపారు. 140 మంది నిరుద్యోగులకు శిక్షణ పొందుతున్నారని, నెలాఖరులోగా రెండు, వచ్చే నెలాఖరుకు మిగిలిన మూడు బ్యాచ్‌లకు శిక్షణ పూర్తవుతుందన్నారు ఎలక్ట్రికల్, వెల్డింగ్, ఆటో క్యాడ్‌పై నిరుద్యోగులకు ఇక్కడ శిక్షణ ఇస్తున్నామన్నారు. ఆయన వెంట డిహెచ్ఎంఒ ఎం.దుర్గారావు దొర, స్కిల్ డెవలప్మెంట్ జిల్లా అధికారి హరి శేషు, తాటిపాక బేస్ ఇన్‌ఛార్జి రాంబాబు తదితరులు ఉన్నారు.

వివరాలు తెలుసుకుంటున్న సిపిఒ

# గందరగోళంగా డిగ్రీ సెమిస్టర్

- 70 పని దినాల్లో పరీక్షలా..!
- నిబంధనలు పట్టని యంత్రాంగం
- విద్యార్థుల తీవ్ర మానసిక ఒత్తిడి

**ప్రజాశక్తి - రాజోలు**

కరోనా సమయంలో ఏర్పడిన డిగ్రీ సెమిస్టరు గందరగోళం నుంచి అన్ని విశ్వ విద్యాలయాలూ నెమ్మదిగా 120 రోజుల సెమిస్టరును జాగ్రత్తగా సుసాధ్యం చేసుకున్నాయి. కానీ అందుకు విరుద్ధంగా ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అందుకు ఈ ఏడాది మార్చి 1న విడుదల చేసిన పరీక్షల సర్క్యులర్ నిదర్శనంగా ఉంది. ఏప్రిల్ 9న సెమిస్టరు పూర్తి కావాల్సి ఉండగా.. మార్చి 18 నుంచే పరీక్ష నిర్వహిస్తామని వెబ్‌సైట్‌లో ప్రొఫెసర్ డి.కల్యాణి సంతకంతో ఉంచిన సర్క్యులర్ విద్యార్థులను అయోమయంలో పడేసింది.

**అసలు చదువుతున్నది పిల్లలా లేక యంత్రాలా?**

విద్యా మనో విజ్ఞాన శాస్త్రం ప్రకారం.. యుజిసి నిబంధనలు, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నియమాల ప్రకారం.. ఒక విద్యా సంవత్సరాన్ని రెండు సెమిస్టర్లుగా విభజించి.. 120 రోజుల సెమిస్టరు వ్యవధి.. తర్వాత 5 రోజులు సెషనల్స్ పరీక్షలు, తర్వాత 7 రోజులు ప్రయోగ పరీక్షలు, ఆపై 15 రోజులు థియరీ పరీక్షలు నిర్వహించాలి. అంటే 5 నెలలు సెమిస్టరుకు ఉండాలి. 120 రోజుల నిర్వహణలో సెలవులు పోగా కనీసం 90 రోజులు పని దినాలు ఉండాలి అనే నిబంధన ఉంది. ఈ విధానాన్ని రాష్ట్రంలోని అన్ని విశ్వ విద్యాలయాలూ పాటిస్తుంటే కేవలం రాజమహేంద్రవరం ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం అధికారులు మాత్రం.. నిబంధనలను తొంగలోకి తొక్కేస్తున్నారు. అసలు చదివేది విద్యార్థులు అనే విషయాన్ని మర్చిపోయి.. వారి స్థానంలో యంత్రాలు విద్యనభ్యసిస్తున్నాయనే అపోహలో ఉన్నట్టున్నారు.

**సింగిల్ మేజర్‌తో మరింత జటిలం!**

ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం పరిధిలో గత కొన్ని విద్యా సంవత్సరాల నుంచి డిగ్రీ సెమిస్టరు విధానంలో.. ఒక్క సెమిస్టరుకు కూడా సక్రమమైన రీతిలో తరగతులు పూర్తిగా జరగకుండానే పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఒక్క సెమిస్టరులో సెలవు దినాలన్నిటిని తీసివేయగా 90 రోజులు వర్కింగ్ డేస్ జరగాలనే నిబంధనలు పట్టించుకోకుండా పరీక్షల టైమ్ టేబుల్ ఇస్తున్నారు. ఈ పరిస్థితి సింగిల్ మేజర్ విధానం వచ్చిన తర్వాత మరింత అగమ్యగోచరంగా మారింది. సింగిల్ మేజర్ వల్ల అన్నీ పేపర్లు ఒకే సబ్జెక్టు వల్ల.. పైగా బాగా ఎక్కువ సిలబస్ వల్ల ఊపిరి పీల్చుకునే టైమ్ కూడా విద్యార్థులకు ఉండటం లేదు. అందువల్ల విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికికి లోనవుతున్నారు.

**ఇదో వింతైన పోకడ!**

మార్చి 18 నుంచి ప్రయోగ పరీక్షలు, 24 నుంచి థియరీ పరీక్షలు అని మార్చి1 న వెబ్‌సైట్‌లో ఉంచిన సర్క్యులర్ పైన.. ఆ సర్క్యులర్ ఫిబ్రవరి 25 న విడుదల చేసినట్టు ఉంది. ఇలాంటి వింత పోకడలు ఆదికవి విశ్వ విద్యాలయంలోనే ఎదురవుతుంటాయి.

**కేవలం 70 రోజుల్లోనే పరీక్షలా!**

ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం థర్డ్ సెమిస్టరు డిగ్రీ పరీక్షలు 2024 డిసెంబర్ 4న పూర్తయ్యాయి. 9.12.2024 ఉనుంచి నాలుగో సెమిస్టరు అకడమిక్ క్యాలెండర్‌లో తరగతులు ప్రారంభం అని ఇచ్చారు. అప్పటి నుంచి లెక్క కడితే ఏప్రిల్ 9 నాటికి 120 రోజుల సెమిస్టరు, 90 రోజుల పని దినాలు పూర్తవుతాయి. 2024 డిసెంబర్ 9 నుంచి అంటే 31 వరకూ 23 రోజులు. వీటిలో యూనివర్సిటీ ఇచ్చిన క్రిస్మస్ పండుగకు మూడు రోజులు, 3 ఆదివారాలు, ఒక రెండో శనివారం తీసివేయగా.. 16 రోజులు పని దినాలు.! 2025 జనవరి నెలలో మొత్తం 31 రోజుల్లో.. యూనివర్సిటీ ప్రకటించిన సంక్రాంతి పండుగకు 7 రోజులు, 3 ఆదివారాలు, రిపబ్లిక్ డేతో కలిపి 11 సెలవులు పోగా.. కేవలం 20 రోజులు మాత్రమే తరగతులు జరిగాయి. ఇక ఫిబ్రవరిలో 28 రోజుల్లో.. 4 ఆదివారాలు, రెండో శనివారం, మహా శివరాత్రి, ఎన్నికలు కలిపి సెలవులు తీసేస్తే 21 రోజులు మాత్రమే పని దినాలు. ఇక మార్చి వచ్చింది. యూనివర్సిటీ ప్రకటించిన పరీక్షల షెడ్యూల్ ప్రకారం 18 నుంచి అయితే మొత్తం18 రోజుల్లో 3 ఆదివారాలు, రెండో శనివారం, హోలీ సెలవులు పోగా కేవలం 14 రోజులు మాత్రమే తరగతులు జరుగుతాయి. అంటే ఈ నాలుగో సెమిస్టర్‌లో పని దినాలను కలుపుకొని లెక్కిస్తే కేవలం 70 రోజులు మాత్రమే పూర్తి అయ్యాయి. మరో 20 రోజులు ఎక్కడికి వెళ్లాయి. అంటే యూనివర్సిటీ అధికారుల దృష్టిలో 70 రోజులు అంటే 90 రోజులని అర్థమా.. 90 రోజులు పూర్తి కాకుండానే విరుద్ధంగా మార్చి 18 నుంచి పరీక్షలు ఇవ్వడం వెనుక అంతరార్థం ఏమిటో మన యూనివర్సిటీ అధికారులకే తెలియాలి.

**యాజమాన్యాల చోద్యం**

ఈ సమస్యపై కళాశాలల యాజమాన్యాలు పట్టించుకోకపోవడం దారుణం. ఎక్కువ కళాశాలల్లో విద్యార్థులకు సరైన విషయ విశ్లేషణ ఇవ్వకుండా బజారులో దొరికే టెస్ట్ పేపర్స్ ఇచ్చేసి సిలబస్‌ను మమ అనిపించేస్తున్నారు. యాజమాన్యం ఎంత త్వరగా పరీక్షలు అయిపోతే అంత మంచిది అని ఆలోచన చేయడం వెనుక అంతర్యం యూనివర్సిటీ అధికారులు గమనించి విద్యార్థుల మానసిక ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. త్వరగా పరీక్షలు పూర్తి అయితే స్టాఫ్ నిలుపుదల చేస్తే జీతాలు కలిసి వస్తాయని కొన్ని యాజమాన్యాలు, విద్యార్థుల ప్రవేశాలకు తిప్పుకోవచ్చునని మరికొన్ని యాజమాన్యాలు ఆలోచిస్తున్నాయి. గతంలోనూ ప్రస్తుతం కూడా యాజమాన్యాలు విద్యార్థులకు ఇబ్బంది ఎదురైతే పట్టించుకోరు. కానీ వాళ్ళకి రావాల్సిన డబ్బులు రాకపోతే మాత్రం మరుక్షణంలో యూనివర్సిటీకి వినతి పత్రాలుపై వినతి పత్రాలు అందజేస్తారు. ఇవన్నీ దష్టిలో ఉంచుకుని విద్యార్థులకు న్యాయం చేసి డిగ్రీ విద్య మనుగడ కాపాడాలని పలువురు విద్యావేత్తలు, విద్యార్థులు కోరుతున్నారు.

**ఆశలన్నీ విసి పైనే..**

ఇలాంటి విరుద్ధ నిర్ణయాలకు చెక్ పెట్టి.. పూర్తి ప్రక్షాళన చేసి.. యూనివర్సిటీని గాడిలో పెడతారని ఇటీవల విసిగా వచ్చిన ఎస్.ప్రసన్నశ్రీ విద్యావేత్తలు ఆశలు పెట్టుకున్నారు. ఆమె విద్యార్థుల సమస్యలను క్షేత్ర స్థాయిలోంచి విశ్లేషణ చేస్తారనే నమ్మకం ఉంది. ఆ నమ్మకంతోనే విద్యార్థులు తమకు న్యాయం చేసి ఏప్రిల్ 9 తర్వాత ప్రయోగ పరీక్షలు, ఏప్రిల్ 16 నుంచి థియరీ పరీక్షలు నిర్వహిస్తారని ఎదురు చూస్తున్నారు.

**పక్క యూనివర్సిటీల్లో పక్కా ప్రణాళిక**

విశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటీ
తరగతులు ప్రారంభం: 25 నవంబర్ 2024
పరీక్షల నిర్వహణ తేదీ : 19 ఏప్రిల్ 2025

**తిరుపతి శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ**
తరగతులు ప్రారంభం: 15 జనవరి 2025
పరీక్షల నిర్వహణ : 24 మే 2025

**గుంటూరు నాగార్జున యూనివర్సిటీ**
తరగతులు ప్రారంభం: 11 నవంబర్ 2024
పరీక్షలు పెట్టబోయే తేదీ: 25 మార్చి 2025

## జిల్లాలో 960 సిసి కెమెరాల ఏర్పాటు

**ఎస్‌పి బి.కృష్ణారావు**

**ప్రజాశక్తి - కొత్తపేట**

జిల్లా వ్యాప్తంగా 960 సిసి కెమెరాలు పబ్లిక్ సహకారంతో అమర్చామని ఎస్‌పి బి.కృష్ణారావు అన్నారు. మరికొన్ని చోట్ల అమర్చే ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా గురువారం కొత్తపేట డిఎస్‌పి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మూడు సంవత్సరాల కేసులను సమీక్షిస్తునామని అన్నారు..కేసుల పరంగా తగు సూచనలు ఇస్తున్నామని అన్నారు. సిసి కెమెరా ల ఏర్పాటు వల్ల కొన్ని కేసులు కూడా పరిష్కరించామన్నారు. నేరస్థుల నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసి నేరస్థుల వేలి ముద్రలు, ఫొటోలు తీసుకుని అప్లోడ్ చేస్తామన్నారు. రాత్రి సమయాల్లో ఎవరైనా అనుమానంగా కనిపిస్తే మొబైల్ కనెక్ట్ పరికరం ద్వారా నేరం చేయకముందే పట్టుకుంటామన్నారు. కొత్తపేట డివిజన్ పరిధిలో పండగల నేపథ్యంలో పోలీస్ సిబ్బంది అందరూ బాగా కష్టపడి మంచిపేరు తీసుకువచ్చారన్నారు. జిల్లాలో సిబ్బంది కొరత ఉందని ఇటీవలే కొత్తగా శిక్షణ పూర్తిచేసుకున్నారని అన్నారు. త్వరలోనే ఎక్కువ సిబ్బంది జిల్లాకి వచ్చే విధంగా కృషి చేస్తానని అన్నారు.వాహన దారులు నిబంధనలు పాటించి హెల్మెట్ ధరించాలని సూచించారు. చలనాలు పాత విధానంలోనే అమలవుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట డిఎస్‌పి సుంకర మురళి మోహన్, శిక్షణ డిఎస్‌పి ప్రదీప్తి, సిఐలు విద్యా సాగర్, శేఖర్ బాబు, భీమా రాజు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి కృష్ణారావు

## అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు అవగాహన

**ప్రజాశక్తి - రావులపాలెం**

మండలపరిధి పొడగట్లపల్లి నవజీవననగర్ అంగన్వాడీ కేంద్రంలో గురువారం సిడిపిఒ ఎ.గజలక్ష్మి ఆదేశాల మేరకు సూపర్ వైజర్ నాగసత్యవేణి ఆధ్వర్యంలో బేటీ పఢావో బేటీ బచావో కార్యక్రమం నిర్వహించి మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ మాట్లాడుతూ విద్యార్థినులు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా చదువులో రాణించాలన్నారు. మగ వారి వేధింపుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమస్య సమయంలో తల్లిదండ్రులకు గాని పోలీస్ తదితర అధికారులకు వెంటనే సమాచారం ఇచ్చి రక్షణ పొందాలన్నారు. విద్యార్థులు లక్ష్యం దిశగా నిరంతరం శ్రమించాలన్నారు. మహిళలు హక్కులు గూర్చి అవగాహన కల్పించి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మాస్ కుమారి, రజినీకుమారి, సరోజిని, ఆదిలక్ష్మి, శ్రీలక్ష్మి, పద్మ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

## నేడు ఏడిదలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ప్రజాశక్తి - మండపేట**

ఏడిదలో విద్యుత్ వైర్లు, చెట్టు కొమ్మలు తొలగింపు నిమిత్తం కారణంగా శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఏడిద, చుట్టుపక్కల ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తారని రామచంద్రపురం ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రత్నాల రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయమును గమనించి విద్యుత్ డిపార్ట్మెంట్ సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు.

# ప్రజారోగ్యంలో పారిశుధ్యం కీలకం

**ప్రజాశక్తి- మామిడికుదురు**

గ్రామాల్లో పారిశుధ్య మనేది ఆరోగ్యం, జీవన ప్రమాణాలకు అత్యంత కీలకమైన అంశంగా గుర్తించాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ పంచాయతీ సిబ్బందిక సూచించారు. గురువారం మండల పరిధి లోని పాశర్లపూడి గ్రామము నందు జాతీయ రహదారి 216 రోడ్డు నిర్మాణంలో సేకరించిన భూములను జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ఆర్‌డిఒ కె.మాధవి తనిఖీ చేశారు భూములు కోల్పోయిన నిర్వాసిత రైతులు ఫిర్యాదుదారులతో భూసేకరణ సమస్యలపై చర్చించారు. అనంతరం పాశర్లపూడి గ్రామపంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం, డంపింగ్ యార్డ్ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు గ్రామ పారిశుధ్య మెరుగుదల అభివద్ధికి సూచికలన్నారు శాస్త్రీయ ద్రుక్పథంతో ఘనవ్యర్థాలను నిర్వహించడంలో చెత్త నుంచి సంపద తయారీ లో జిల్లాను ఆదర్శ ప్రాయంగా నిలపడానికి పంచాయతీ శాఖ అధి కారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఈ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పని తీరుపై క్షేత్రస్థాయి పారి శుధ్య సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నా రు. స్వచ్ఛాంధ్రప్రదేశ్ సాధన దిశగా ప్రభుత్వం వ్యక్తిగత, గ్రామ పరిసరాల పరిశుభ్రతపై దృష్టి కేంద్రీకరిస్తూ అనేక వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి అమలు చేస్తుందని గ్రామీణ ప్రాం తాలలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలలో అపరిశుభ్రత మూలంగా అనారో గ్యాల బారిన పడకుండా ఎప్పటికప్పుడు తడి, పొడి ,ప్లాస్టిక్ వ్యర్థాలను ఈ యొక్క కేంద్రాలకు తరలిస్తూ విభ జించి వానపాములతో వర్మీ కంపోస్టును, ప్లాస్టిక్ ను నేరుగా లేదా కరిగించి విక్రయాలు చేపట్టాలని సూచించారు. ప్రజల ఆరోగ్యవంతమైన మనుగడ, జీవనశైలి కొరకు పారిశుధ్య వ్యవస్థను మెరుగుపరచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. గ్రామ పంచాయితీలలో సంపద తయారీ కేంద్రాలు నిర్వ హణ ద్వారా గ్రామాలను అత్యంత పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని సూచించారు. గ్రామాలకు వెళ్లే రోడ్డు ఇరువైపులా మార్జి న్లలో చెత్త వేయ డం ద్వారా ప్రజలు అనారోగ్యం పాలు కాకుండా నేరుగా డంపింగ్ యార్డుకు చెత్తాచెదారాలను తరలిస్తూ వర్మీ కంపోస్ట్ తొట్టెల ద్వారా విలువైన వర్మి కంపోస్టును, జిరో బడ్జెట్ ప్రకృతి సేద్యానికి మంచి సేంద్రీయ ఎరువుగా వినియోగిస్తూ పండించిన సేంద్రియ ఉత్పత్తులకు పోటీ ప్రపంచంలో అత్యంత డిమాండ్ ఉందని ఆ దిశగా గ్రామా లను పరిశుభ్రంగా తీర్చిదిద్దడంతోపాటు పరోక్షంగా అదనపు ఆదాయాన్ని వర్మి కంపోస్ట్ తయారీ ద్వారా పంచా యతీలు ఆర్జించాలని సూచించారు. గ్రామ పంచాయతీలు అదనపు ఆదాయాన్ని సమకూర్చు కునేందుకు ఇదొక చక్కటి ఆదాయ మార్గమని, ఉపాధి హామీ తరపు నుంచి గ్రీన్ అంబాసిడర్లను నియమించు కుంటూ గ్రామపంచాయతీ చెత్తను సేకరించి వాటిని విభజించడం ద్వారా ప్లాస్టిక్ను వేరుగా చేయడం, వ్యర్థాలను వేరుగా చేసి సేంద్రీయ ఎరువుగా వానపాముల సహకారంతో తయారు చేయడం ద్వారా ఇప్పటికే చాలా పంచాయతీలు ఆర్థిక పరిపుష్టిని సాధిస్తున్నాయని అన్నారు. ఒక పక్కన గ్రామాలలో పారిశుధ్యం మెరుగుపడటం, మరో పక్క పరోక్షంగా గ్రామ పంచాయతీలకు అదనపు రాబడిని సమకూర్చుకోవడానికి చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలు ఎంత గానో దోహదపడుతున్నాయన్నారు. చెత్త నుంచి సంపద తయారీ అనేది ఒక ముఖ్యమైన ప్రక్రియ ని ఇది పర్యావరణ పరిర క్షణకు దోహదపడుతుందన్నారు ప్రజలకు పారిశుధ్యం యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించాలన్నారు. ఈ ప్రక్రియలో వ్యర్థపదార్థాలను ఉపయోగించి విలువైన ఉత్పత్తులను తయారు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.మాధవి, జిల్లా పంచాయతీ అధికారి శాంత లక్ష్మి, తహశీల్దార్ సుబ్రహ్మణ్య ఆచారి, పంచాయతీ రెవెన్యూ సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

బైపాస్ రోడ్డుకు సేకరించిన భూములు పరిశీలిస్తున్న కలెక్టర్, ఆర్‌డిఒ

దాత ఇచ్చిన మైక్‌సిస్టమ్ హెచ్‌ఎంకు అందిస్తున్న ఎంఇఒ

## ఎంపిపి పాఠశాలకు మైక్ సిస్టమ్ బహూకరణ

**ప్రజాశక్తి - ఆలమూరు**

చింతలూరు మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలకు సామర్లకోటకి చెందిన సాఫ్ట్ వేర్ ఇంజినీర్ గిడుతూరి మల్లేశ్వరరావు కుమారుడు శ్రీరామ్ భరద్వాజ్ పుట్టినరోజు సందర్భంగా సుమారు రూ.పది వేలు విలువ చేసే ప్రముఖ బోట్ కంపెనీ స్పీకర్ను, మైక్ సిస్టమ్ తో సహా గురువారం బహూకరించారు. పాఠశాల అభివద్ధిలో తన వంతు భాగస్వామ్యం కావడానికి ఈ స్పీకర్ ను బహురిస్తున్నట్టు దాత తెలిపారు. ఆలమూరు ఎంఇఒ బి.అప్పాజీ చేతుల మీదుగా స్పీకర్ను పాఠశాల హెచ్‌ఎం వుడతా వెంకటేశ్వరరావు కి అందించారు. ఎంఇఒ మాట్లాడుతూ కుమారుని పుట్టినరోజున కుటుంబ సభ్యులతో కాకుండా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సాయం చేయాలన్న ఆలోచనతో స్పీకర్ను బహూకరించిన దాతని అభినందించారు. ఇటీవల అనేక మంది దాతల సహాయ సహకారాలతో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడం ద్వారా పాఠశాలను అభివృద్ధి పరుస్తున్న హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్ లను ఎంఇఒ అభినందించారు. పాఠశాల రికార్డులు, విద్యార్థుల హాజరు, ప్రగతిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌ఎంటి అపర్ణ పాల్గొన్నారు.

## వాడపల్లి వెంకన్న కళ్యాణోత్సవాలపై సమీక్ష

**ప్రజాశక్తి - ఆత్రేయపురం**

వాడపల్లి వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవాల ఏప్రిల్ 7వ తేదీ నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం కొత్తపేట ఆర్‌డిఒ పి.శ్రీకర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వివిధ శాఖలకు చెందిన అధికారులతో కళ్యాణోత్సవాలపై తీసుకోవలసిన ఏర్పాట్లపై ఆర్‌డిఒ సమీక్ష చేశారు. రెవెన్యూ, పోలీస్, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక, జల వనరుల శాఖ అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆర్‌డిఒ శ్రీకర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షలాదిగా భక్తులు కళ్యాణోత్సవాలు తిలకించేందుకు, స్వామివారి దర్శనానికి వచ్చే అవకాశం వున్నందున అందుకు తగిన విధంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని అన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్యశాఖ శానిటేషన్, వైద్య శిబిరాలు ఏర్పాటుపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. యాత్రికుల సౌకర్యార్థం రావులపాలెం నుంచి బస్సు సర్వీసులు ఏర్పాట్లపై ఆర్‌టిసి అధికారులతో సమీక్షించారు. కర్పూర హారతి సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అగ్నిమాపక శాఖ తీసుకోవాల్సిన జాగ్రత్తల పైన, తెప్పోత్సవ కార్యక్రమంలో జల వనరుల శాఖ తీసుకోవాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు. తహశీల్దార్ టి.రాజేశ్వరరావు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. సమీక్ష సమావేశానికి వచ్చిన ఆర్‌డిఒ ముందుగా వేదపండితుల ఆశీర్వచనాలతో స్వామివారి దర్శనం చేసుకున్నారు నల్లం సూర్య చక్రధర్ రావు మండల టిడిపి అధ్యక్షుడు ముదునూరి వెంకటరాజు ఆలయ సిబ్బంది ఆర్‌డిఒకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

అధికారులతో మాట్లాడుతున్న కొత్తపేట ఆర్‌డిఒ

## టెన్త్ పరీక్షా కేంద్రాల పరిశీలన

**ప్రజాశక్తి - కపిలేశ్వరపురం**

పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ఈనెల 17 నుంచి 31 వ తేదీ వరకు నిర్వహించనున్నారు. టెన్త్ పబ్లిక్ పరీక్షా కేంద్రాల ఏర్పాట్లను మండల విద్యాశాఖ అధికారి కె.తాతారావు పరిశీలించారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 3 ప్రయివేటు పాఠశాలలు, 8 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు 470 మంది అంగర 1, 2 పరీక్షా కేంద్రం, కపిలేశ్వరపురం పరీక్షా కేంద్రాలలో పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. వీరిలో బాలురు 231 మంది, బాలికలు 239 మంది పరీక్షలు రాయనున్నారు. అంగర పరీక్ష కేంద్రంలో 315 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని, కపిలేశ్వరపురం పరీక్ష కేంద్రంలో 133 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. వాకతిప్ప జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన 22 మంది విద్యార్థులు, గంగవరం మండలం పామర్రు హై స్కూల్ లో పరీక్షలు రాస్తారన్నారు, మార్చి 31 వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. విద్యార్థులు పరీక్షలు రాసేందుకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ పరీక్షా కేంద్రాలను ఎంఈవో తాతారావు పరిశీలించారు .

అంగరలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఇఒ తాతారావు





## ఉపాధి పనుల పరిశీలన

**ప్రజాశక్తి - ఉప్పలగుప్తం**

భీమనపల్లి పంచాయతీ పరిధిలో ఉపాధి పనులు గత నాలుగు రోజులుగా చేపట్టారు. గురువారం కూలీలు చేస్తున్న ఉపాధి పనులను సర్పంచ్ పెయ్యల రాజ్ కుమార్ పరిశీలించారు. అనంతరం ఉపాధి కూలీలకు సూచనలు సలహాలు ఇచ్చారు. 203 మంది కూలీలు మూడు వారాలుగా పంట బోదెల పూడికతీత, కొబ్బరి చెట్లకు పళ్ళాలు కొట్టడం వంటి పనులు చేస్తున్నారు. అలాగే మస్తర్లను తనిఖీ చేసిన సర్పంచ్ రాజ్ కుమార్ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ అయితాబత్తుల శ్రీనివాసరావుకు పలు సూచనలు చేశా రు. వేసవిలో ఉపాధి కూలీలకు రెండు పూటలా పని విధానం లేకుండా చూడాలని ఈ సందర్భంగా ఉపాధి కూలీలు సర్పంచ్ రాజ్ కుమార్ ను కోరారు. ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్ కె.బాలరాజు ఉన్నారు.

భీమనపల్లిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ రాజ్ కుమార్

## నూతన మద్యం దుకాణాలకు 300 దరఖాస్తులు

**జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ దుర్గా వరప్రసాద్**

**ప్రజాశక్తి - అమలాపురం**

నూతన మద్యం దుకాణాల కోసం ఇప్పటివరకు 6 ఎక్సైజ్ స్టేషన్ల పరిధి నుంచి సుమారు 300 దరఖాస్తులు అందినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సాధనాల కనక దుర్గా వరప్రసాద్ తెలిపారు. నూతన మద్యం పాలసీ విధి విధానాల్లో భాగంగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 150 షాపులు గాను కుదించి ప్రభుత్వం 133 మద్యం దుకాణాలను ఏర్పాటు చేసే విధంగా నోటిఫికేషన్ జారీ చేసిన విషయం పాఠకులకు తెలిసిందే.ఈ విషయమై జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సాధనాల కనక దుర్గా వరప్రసాద్ గురువారం మాట్లాడుతూ జిల్లాలో ఆరు ఎక్సైజ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. రాజోలు, రామచంద్రాపురం, అమలాపురం, కొత్తపేట, ఆలమూరు, ముమ్మిడివరం,స్టేషన్లకు సంబంధించి గతంలో ప్రభుత్వం 150 మద్యం షాపులు నిర్వహించగా వాటిని కుదించి 133 షాపులకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. ఈ ప్రక్రియ ఈనెల 1 తేదీ నుంచి దరఖాస్తులను ఎక్సైజ్ స్టేషన్లలో తీసుకుంటారని తెలిపారు. ఇప్పటివరకు 6 ఎక్సైజ్ స్టేషన్ల పరిధి నుంచి సుమారు 300 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఈ దరఖాస్తుల స్వీకరణ అక్టోబర్ 9వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు స్వీకరిస్తారని అన్నారు. అనంతరం 11వ తేదీ ఉదయం 8 గంటల నుంచి అధికారులు లబ్ధిదారులు సమక్షంలో వీడియోగ్రఫీ ద్వారా కలెక్టర్ నిర్వహణలో డ్రా తీస్తారని ఆయన తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ మూడు పద్ధతుల్లో ఆన్లైన్, ఆఫ్లైన్, హైబ్రిడ్‌గా స్వీకరిస్తున్నామని అన్నారు. ప్రక్రియ ముగిసిన తరువాత కలెక్టర్ సమక్షంలో గోదావరి భవన్ వద్ద అధికారులు,అప్లై చేసిన లబ్ధిదారులు సమక్షంలో డ్రా తీస్తారని అన్నారు. డ్రా తగిలిన మొదట లబ్ధిదారుని ఎంపిక అందరి సమక్షంలో జరుగుతుందన్నారు. అయితే సోమవారం నుంచి మద్యం షాపుల కొరకు దరఖాస్తు స్వీకరణ వేగవంతం అవుతుందని పలువురు చర్చించుకుంటున్నారు.

## ప్రత్యేక పారిశుధ్య పనుల నిర్వహణ

**ప్రజాశక్తి - మామిడికుదురు**

మండల కేంద్రమైన మామిడికుదురులో సర్పంచ్ గౌస్ మోహిద్దీన్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి పి విఆర్‌కె.రాజు పర్యవేక్షణలో గురువారం ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు 216వ జాతీయ రహదారి, రెండవ ప్రధాన రహదారిలలో పక్కన పేరుకుపోయిన చెత్తను పంచాయతీ ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డ్‌కు తరలించారు. ప్రధాన వీధుల్లో చెత్తను తొలగించి బ్లీచింగ్ చల్లించారు.

చెత్తను తరలించే ఏర్పాట్లు పరిశీలిస్తున్న కార్యదర్శి రాజు

## దోమల నిర్మూలనకు చర్యలు

**ప్రజాశక్తి - ఉప్పలగుప్తం**

గ్రామంలో దోమల బెడద విపరీతంగా ఉన్న కారణంగా వాటిని నిర్మూలించేందుకు చర్యలు చేపట్టినట్టు స్థానిక సర్పంచ్, సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు తెలిపారు. ఉప్పలగుప్తంలో గురువారం దోమల నిర్మూలనకు పంచాయతీ కార్మికులు ఫాగింగ్ మిషన్ ద్వారా దోమల నివారణ మందును వెదజల్లారు. దోమల నిర్మూలనకు చేపడుతున్న పనులను సర్పంచ్ చిన్నవరాజు పరిశీలించారు. గ్రామంలోని ప్రతి వీధిలోను దోమల నిర్మూలనకు చర్యలు చేపట్టామని ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా పడవేయకూడదని సర్పంచ్ చిన్నవరాజు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిక్కిరెడ్డి రామకృష్ణ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఫాగింగ్ ను పరిశీలిస్తున్న సర్పంచ్ చిన్నవరాజు

ప్రజాశక్తి
www.prajasakti.com



# మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

**జెసి టి.నిషాంతి**

ప్రజాశక్తి - అమలాపురం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రభుత్వ దార్శనికతకు అనుగుణంగా వివిధ శాఖల సమష్టి భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని జెసి టి.నిసాంతి సూచించారు. గురువారం స్థానిక కలెక్ట రేట్లో డిఆర్‌డిఎ మెప్మా, వైద్య ఆరోగ్యం, స్త్రీ, శిశు సంక్షేమం, పరిశ్రమలు తదితర శాఖల అదికారులతో సమావేశం నిర్వహించి, శాఖల వారీగా కార్యాచరణను వివరించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమం స్థానిక సత్యనారాయణ గార్డెన్స్ నందు నిర్వహించనున్నట్లు తెలిపారు. గౌరవ ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంలో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కషిచే యాలన్నారు. వివిధ శాఖల పరిధిలో మహిళాభివృద్ధికి అమలవుతున్న పథకాలు, కార్యక్రమాలపై మహిళలను జాగృతం చేసి. వాటిని సద్వినియోగం చేసుకునేలా ముందుకు నడిపించేం దుకు స్టాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. డిఆర్డీఏ,మహిళా శక్తిని, యుక్తిని చాటిచెప్పేలా మహిళా దినోత్సవ వేడుకలు సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలతో సహా వివిధ రంగాల్లో మహిళామణులు సాధించిన విజయాలను మహిళా శక్తిని, యుక్తిని గుర్తించి వారిని స్ఫూర్తిగా తీసుకొని మరింత మంది సమగ్రాభివద్ధి దిశగా ముందడుగు వేసేలా ప్రోత్సహించేందుకు ఏటా మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తు న్నామని అన్నారు. ఈ వేడుకలను విజయవంతం చేసేం దుకు గ్రామీణాభివద్ధి మెప్మా, జిల్లా పరిశ్రమల కేంద్రం, మహిళా శిశు సంక్షేమం, వివిధ శాఖల అధికారులు మహిళా కేంద్రీకత కార్యక్రమాల నిర్వహణకు సిద్ధం కావాలన్నారు. ప్రభుత్వాల కార్యక్రనూల చేయూతతో పారిశ్రామికవేత్తలుగా అభివృద్ధి పథంలో రాణిస్తున్న మహిళా మణులతో స్ఫూర్తిదాయక ప్రసంగాలు ఏర్పాటు చేయడంతో పాటు వారిని సన్మానించాలన్నారు. మహిళా సాధికారతను ప్రతిబింబించేలా వివిధ శాఖల ఆధ్వర్యంలో సూర్య ఘర్ డ్వాక్రా ఉత్పత్తులు, విశ్వకర్మ యోజన, పోషకాహారం, ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు.ఇప్పటికే గ్రౌండింగ్ అయిన యూనిట్లు ఆర్థికంగా ప్రగతిపథంలో పయనించేలా సరైన మార్గనిర్దేశనం చేయాలన్నారు. మహిళల భద్రత కూడా అత్యంత ప్రాధాన్య త అంశం కాబట్టి ఆదిశగా వినూత్న ఆలోచనలతో కార్యక్రమాలు అమలుకు చొరవ తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. స్వీయ రక్షణపై మహిళలకు అవగాహన కల్పించే కార్యక్రమాలపైనా దృష్టిసారించాలని ఆదేశించారు. లైన్ డిపార్ట్మెంట్ ప్రతినిధులు ప్రణాళికా బద్ధంగా వ్యవహరించాలన్నారు. బ్యాంకు లింకేజీ మద్దతు, ప్రకతి సేద్యం ఉత్పత్తులు, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్, చిరుధాన్యాల విలువ ఆధారితం, మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు చేయూతనిచ్చే పథకాలు, కార్య క్రమాలు, పోషణ భద్రత, సిఎం విశ్వకర్మ, యోజన పిఎంఇజిపి వంటి పథ కాలు, లఖ్పతిదీదీ, డ్రోన్ దీదీ తదితరాలకు సంబం ధించిన స్టాళ్లను ఏర్పాటు చేయాలన్నారు.మహిళల భద్రతకు ఇస్తున్న ప్రాధాన్యతలో భాగంగా వినియోగిస్తున్న ఆధునిక సాంకేతిక పరి జ్ఞానం వంటి వాటిపైనా దృష్టి సారించాలని ప్రత్యేక అవగాహన ర్యాలీల నిర్వహణకూ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ శివశంకర్ ప్రసాద్, జిల్లా పరిశ్రమల కేంద్రం ఎడి శివరాం ప్రసాద్, ఎల్‌డి ఎం.కేశవ వర్మ, ఐసిడిఎస్ పీడీ శాంతి కుమారి, ఎపి ట్రాన్స్‌కో ఎస్ఇ రాజ బాబు తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న జెసి టి.నిషాంతి

## నేరాలు ఘోరాలు

### రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి

ప్రజాశక్తి - కాజులూరు

మండలంలోని పల్లి పాలెం గ్రామ శివారు కాలా వారి పేటకు చెందిన జిత్తుగ భవాని ఏలూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. స్థానికులు చెప్పిన వివరాలు ప్రకారం...జిత్తుగ అప్పారావు, భవానీ దంపతులు జీవనోపాధి కోసం కొంత కాలం క్రితం హైదరబాద్ వెళ్లారు. భర్త సెక్యూరిటీగా పనిచేస్తూ విద్యుత్తు మరమ్మతులు చేస్తుండగా భార్య పలువురి ఇంటి వద్ద పని చేస్తుందన్నారు. ఈ క్రమంలో బంధువుల వివాహం నిమిత్తం కాకినాడ వస్తుండుగా గురువారం తెల్లవారుజామున ఏలూరు వద్ద ఈమె ఎక్కిన ప్రయివేట్ ట్రావెల్ బస్సు సిమెంట్ లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భవానీ మృతి చెందారు. ఈమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో పెద్ద కుమారుడు ఇంజనీరింగ్ చేస్తున్నాడు. చిన్న కుమారుడు ఇంటర్మీడియట్ చదువుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

### పొగాకు గొడౌన్‌లో మంటలు

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని రామేపాలెం గ్రామానికి చెందిన రైతు మైలవరపు పెద్దకాపుకి చెందిన పొగాకు గొడౌన్ ప్రమాదవశాత్తు దగ్ధం అయింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.5 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటన ప్రాంతానికి వచ్చేటప్పటికి పూర్తిగా దగ్ధం అయింది. జరిగిన నష్టానికి ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని అందించాలని స్థానికులు కోరారు.

### పొగాకు బేరన్ దగ్ధం

ప్రజాశక్తి-గోపాలపురం

ప్రమాదవశాత్తు పొగాకు బేరన్‌లో మంటలు చెలరేగి సుమారు రూ.5 లక్షల నష్టం వాటిల్లిందని జంగారెడ్డిగూడెం ఫైర్ స్టేషన్ అధికారి జి.అబ్రహం తెలిపారు. గురువారం వాదాలకుంటలో గద కుమారికి చెందిన పొగాకు బ్యారన్ దగ్ధమయ్యింది. స్థానిక రైతులు బేరన్ నిప్పు అంటుకోవడంతో జంగారెడ్డిగూడెం అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేయడంతో హుటాహుటిన జంగారెడ్డిగూడెం అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలు అదుపు చేశారు.

### హామీలను నెరవేర్చని ప్రామోటెక్ కంపెనీ

ప్రజాశక్తి - అల్లవరం

ఓడలరేవు ఒఎన్‌జిసి నిర్మాణ పనుల్లో కాంట్రాక్ట్ సంస్థ అయినా ప్రామోటెక్ కంపెనీ ఇచ్చిన హామీ నెరవేర్చకుండా ఓడలరేవు గ్రామ ప్రజలను మోసం చేసిందని ఆ గ్రామస్తులు ఆరోపించారు. గ్రామంలో నిరుద్యోగులైన యువకులకు వారి అర్హతలను బట్టి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని మాట ఇచ్చారని, కానీ తీరా ఆ మాట తప్పి మోసానికి పాల్పడ్డారని మండిపడ్డారు. కంపెనీ కేవలం 18 మందికి ఉద్యోగాలు ఇప్పించినారు. ఇంకా చాలామంది ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో మిగిలిపోయిన అర్హులైన యువకులకు వారి అర్హతను బట్టి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని లేకపోతే సంస్థ కార్యకలాపాలను స్తంభింప చేస్తామని హెచ్చరించారు. ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఓడలరేవు ఒఎన్‌జిసి టెర్మినల్ ముందు గ్రామస్తులు నిర్వహిస్తున్న నిరసన మూడో రోజుకు చేరింది. సంస్థ తమ డిమాండ్లను గనక అంగీకరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఉద్యమకారులకు మండల టిడిపి అధ్యక్షులు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరు సత్తిబాబు రాజు, జనసేన నాయకుడు గుర్రం కృష్ణ బెంట్ వద్దకు వచ్చి తమ సంఘీభావం తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో కొల్లు విష్ణుమూర్తి, నాతి లెనిన్ బాబు, కానుమేను రామ్ కుమార్, పాలమూరి వెంకటరెడ్డి, కొల్లు త్రిమూర్తులు, ఇల్లింగి శ్రీను, పెనుపోతు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

### మోటార్లతో నీరు తోడితే చర్యలు

ప్రజాశక్తి - కాట్రేనికోన

శివారు పంట పొలాలకు సాగునీరు అందకుండా అక్రమ పైపులు, మోటార్లు ద్వారా సాగునీరు తరలించే వారిపై చర్యలు తప్పవని ఆర్డీఓ ఎస్. మల్లిబాబు హెచ్చరించారు. జీవల అక్రమంగా నీరు తరలిస్తున్న పైపులను తొలగిస్తున్న సందర్భంగా ఇరిగేషన్ అధికారులపై కొందరు రైతులు దురుసుగా ప్రవర్తించారు. ఈ నేపధ్యంలో కలెక్టర్ ఆదేశాలతో గురువారం మత్స్యశాఖ అధికారి కరుణాకర్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారులతో కలిసి ఆయన నీలపల్లి, పి.మల్లవరం పంట కాలువలను పరిశీలించారు. డివిడిగా డామ్ పరిధిలో అక్రమంగా ఏర్పాటు చేసిన 12 పైపులను అధికారులు తొలగించారు. శివారు ప్రాంతాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఆర్‌డిఓ అన్నారు. పంటలు పూర్తి పక్వదశలో దిగుబడి కోసే వెళ్లేలా పైన రైతులు సహకరించాలన్నారు. అక్రమంగా ఎటువంటి పైపులు వేసిన వారిని తొలగించి కేసులు పెట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పి.త్రినాధరావు, సిఐ చైతన్యకృష్ణ, ఇరిగేషన్ ఎఇ అనసూ, డిసి ఛైర్మన్ వేగేశ్న భాస్కరరావు, నీటి సంఘాల అధ్యక్షులు అల్లూరి కాశీ విశ్వనాథ్‌వర్మ, ఉంగరాల గోపి, కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### కనీస వేతనం అమలు చేయాలి

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి లేబర్ యాక్ట్ ప్రకారం ప్రభుత్వ అమలు చేయవలసిన కనీస వేతనం తక్షణమే అమలు చేయాలని యానాం మిల్స్ బాయిలర్స్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక జండా స్తంభం వద్ద జరుగుతున్న మిల్ బాయిలర్ ఆందోళన గురువారం నాటికి మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు అర్జాని దినేష్, కాటంశెట్టి రామమూర్తి తదితరులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 23 సంవత్సరాల నుంచి వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో మిల్ బాయిలర్‌గా పనిచేస్తున్న వందలాదిమంది సిబ్బందికి రూ.10వేలు నుంచి రూ.18వేల వేతనం పెంచుతానని ముఖ్యమంత్రి రంగస్వామి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే జీఓను విడుదల చేసి మిల్ బాయిలర్స్‌కు న్యాయం చేయాలని కోరారు.

ఎస్ఎన్ఎమ్ కళాశాల పరీక్ష కేంద్రాల వద్ద ట్రైనీ డిఎస్పీ ప్రదీప్, సిబ్బంది

### ఇంటర్ పరీక్షా కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - అంబాజీపేట

స్థానిక ఎస్ఎన్ఎమ్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తును ట్రైనింగ్ డిఎస్పి పి.ప్రదీప్ గురువారం పరిశీలించారు. ఈ పరీక్ష కేంద్రంలో 285 మంది విద్యార్థులు పరీక్షలు రాయవలసి ఉండగా 273 మంది పరీక్షలు హాజరయ్యారు. 12 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్లు ఎస్.ఎల్.రాథా మణి తెలిపారు. అనంతరం పుల్లేటికుర్రు ఎవిఎస్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని ప్రదీప్ పరిశీలించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు ఎటువంటి వత్తిడిలకు గురి కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ప్రదీప్ సూచించారు. ఆమె వెంట పోలీసు సిబ్బంది ఎం.రామచంద్రరావు, వరలక్ష్మి, మహిళా పోలీసులు బి.వరలక్ష్మి, సిహెచ్.ప్రశాంతి, పి.మాధురి, ఆర్ఎస్ఎల్.భవానీ, తదితరులు పాల్గొన్నారు.

**ఇంటర్ పరీక్షకు 76 మంది గైర్హాజరు**

**ముమ్మిడివరం:** ఇంటర్ మొదటి సంవత్సరం బోటని, మాథ్స్ 1ఎ, సివిక్స్, ఒకేషనల్ పరీక్షకు సంబంధించి 76మంది గైర్హాజరయ్యారని పరీక్షల కస్టోడియన్ అధికారి డి.విజయ కుమార్ గురువారం తెలిపారు. రాష్ట్ర వ్యాప్త పరీక్షల్లో భాగంగా మొదటి సంవత్సరం పరీక్షకు మండలంలోని డా.మోకా గణపతి రావు ప్రభుత్వ జూనియర్ కళాశాల, తారా జూనియర్ కళాశాల, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలకు చెందిన మొత్తం 921 మంది పరీక్షలు రాయవలసి ఉండగా 845 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. 76మంది గైర్హాజరయ్యారు. డాక్టర్ ఎంజిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 161మందికి 150 మంది హాజరు కాగా 11 మంది, తారా కళాశాలలో 288 మందికి 269 మంది హాజరు కాగా 19 మంది, గురుకుల పాఠశాలలో 307 మందికి గాను 283 మంది హాజరు కాగా 24 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఒకేషనల్ విద్యార్థులకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ప్రిన్సిపల్ ఆఫ్ క్రాప్ ప్రొడక్షన్ పరీక్షకు 165 మందికి 143 మంది హాజరు కాగా 22మంది గైర్హాజరైనట్లు కస్టోడియన్ తెలిపారు.



సాయం అందజేస్తున్న కామన్ మేన్ సేవాదళ్, తదితరులు

### అగ్నిప్రమాద బాధితురాలికి రూ.10 వేల సాయం

ప్రజాశక్తి - కొత్తపేట

అగ్ని ప్రమాద బాధితురాలికి కామన్ మేన్ సేవాదళ్ గురువారం ఆర్థిక సాయం అందించింది. వానపల్లి గాంధీనగర్ గ్రామానికి చెందిన తాడి మంగాదేవి కొద్దిరోజుల క్రితం వంట చేస్తుండగా ఆకస్మాత్తుగా ఫీట్స్ రావడంతో పక్కనే ఉన్న కట్టెల పొయ్యి మీద పడింది. ఈ ఘటనలో ఆమె శరీరం సుమారు 70 శాతం వరకు కాలిపోయి తీవ్రంగా గాయపడింది. ఆమె కుటుంబం ఆర్థికంగా నిరుపేద కావడంతో వైద్య ఖర్చులు భరించడానికి ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని ఆ గ్రామంలోని యువకులు కామన్ మేన్ సేవాదళ్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన సేవాదళ్ సభ్యులు, మంగాదేవికి మెరుగైన చికిత్స అందించేందుకు ఆమె కుటుంబానికి రూ.10వేల సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బొక్కా ప్రసాద్, వక్కపట్ల చంద్రశేఖర్, గునుపాటి రమేష్, ముషిణి వెంకట రమణ, కముజు శ్రీనివాస్, దాకారపు నాగేంద్ర, ఇసినెప్పల్లి దుర్గా ప్రసాద్, అంబటి సాగర్, బొక్కా పల్లంశెట్టి తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు, డ్రైయినేజీ నిర్మాణ ప్రాంతం పరిశీలన

ప్రజాశక్తి - అల్లవరం

తహశీల్దార్ కార్యాలయం, 30 పడకల ఆసుపత్రి రోడ్డు మార్గానికి సిసి రోడ్డు, సిసి డ్రైనేజీ నిర్మాణానికి కలిపి రూ.35లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఆ ప్రాంతాన్ని పంచాయతీరాజ్ ఇఇ రాజకుమార్ స్థానిక కూటమి నాయకులతో కలిసి గురువారం పరిశీలించారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్, అల్లవరం మండల టిడిపి అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారులు రోడ్డు కొలతలు సేకరించారు. తహశీల్దార్ కార్యాలయం, వెలుగు ఆఫీస్, గ్రంథాలయం, మండల స్థాయి 30 పడకల ఆసుపత్రి, రైతు భరోసా కేంద్రం ఇలా అనేక కార్యాలయాలకు నెలవుగా ఉన్న ఆ ప్రాంతానికి ఎట్టకేలకు రోడ్డు సదుపాయం లేని దుస్థితి. ఎప్పుడో నిర్మించిన గ్రావెల్ రోడ్డు దారుణ దశకు చేరుకున్నప్పటికీ నిర్లక్ష్యానికి గురైన పరిస్థితి. ఈ సందర్భంగా రోడ్డు నిర్మాణం వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులను సత్తిబాబు రాజు కోరారు. రోడ్డు పరిశీలించిన వారిలో సదిపల్లి సూర్య నారాయణరాజు, బండిపుప్పల్ల సత్యనారాయణ, కంకిపాటి వీరబాబు, కంకిపాటి సుబ్బారావు, మామిడిశెట్టి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

గ్రహణ మొర్రి/శూలతో బాధ పడుతున్న చిన్నారులకు నిర్వహణ పరీక్షలు చేసి ఆపరేషన్ చేసేందుకు ఈ నెల 7న శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సహిత విద్యా జిల్లా కో ఆర్డినేటర్ ఎలిషా ఎలిజబెత్ ముద్రణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సమగ్ర శిక్ష, బసవ తారకం క్యాన్సర్ హాస్పిటల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో శుక్రవారం ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని జిల్లా కార్యాలయ ప్రాంగణంలోని ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరంలో జిల్లాలో గ్రహణ మొర్రి /శూల తో బాధ పడుతున్న వారికి ఉచితంగా వైద్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, అవసరమైనవారికి ఉచిత శస్త్రచికిత్స చేస్తారన్నారు. ఈ వైద్య శిబిరానికి హాజరైన చిన్నారులకు రవాణా భత్యం చెల్లిస్తారన్నారు. ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యా శాఖాధికారి, అదనపు పథక సంచాలకులు కోరారు. వివరాలకు జిల్లా సహిత విద్య కో ఆర్డినేటర్ సెల్ నెం. 99636 54283ని సంప్రదించాలని తెలిపారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు జిల్లా కమిటీ

### ఆశాల అరెస్టులపై సిఐటియు ఖండన

ప్రజాశక్తి - కొత్తపేట

ఆశాల వర్కర్ల అరెస్టులను సిఐటియు జిల్లా కమిటీ ఖండించింది. రాష్ట్ర కమిటీ అనుమతి తీసుకుని శాంతియుతంగా నిరసన చేయటానికి పిలుపునిస్తే ఆ పిలుపునందుకు రాష్ట్రవ్యాప్తంగా ఆశా వర్కర్లందరూ తమ సొంత వాహనాలు పెట్టుకుని చలో విజయవాడ బయలు దేరారు. వారి ఎక్కడకక్కడ అరెస్ట్ చేయడానికి సిఐటియూ జిల్లా కమిటీ ఖండించిది. ఈ సందర్భంగా గురువారం పోలీసులు నిర్బంధాన్ని నిరసిస్తూ కొత్తపేట మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద. ధర్నా నిర్వహించి తహశీల్దార్ రాంబాబుకు వినత పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా సిఐటియు జిల్లా కమిటీ మాట్లాడుతూ ఆశా కార్యకర్తల పట్ల.ప్రభుత్వం వైఖరి మార్చుకోవాలన్నారు. గత ప్రభుత్వం ఇదే వైఖరి వహించిందన్నారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా ఇదే వైఖరి అవలంబిస్తోందన్నారు. జెండాల మారినప్పటికీ వాళ్ల ఎజెండాలు ఒకటేనన్నది కార్మిక వర్గం తెలుసుకోవాలన్నారరు. భవిష్యత్తులో మరిన్ని పోరాటాలు చేయడానికి మనం సిద్ధం కావాలన్నారు. మీరెవరు ఆధర్య పడవద్దని, ధైర్యంగా ఉండి ఎక్కడికక్కడ ధర్నాలు, నిరసనలు చేయాలని కోరుతున్నామని పిలుపునిచ్చారు.

### గుండెపోటుతో విఆర్‌ఎ మృతి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

పరంజ్యోతి (ఫైల్)

ఎన్.కొత్తపల్లి విఆర్ఎ గా విధులు నిర్వహిస్తున్న మధుర పరంజ్యోతి (58) గురువారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పరంజ్యోతి భౌతికకాయాన్ని సర్పంచ్ కుంచే చిట్టి కుమారి, తహశీల్దార్ వివిఎస్.దివాకర్‌లు సందర్శించి ఘన నివాళులర్పించారు. పరంజ్యోతి కుటుంబాన్ని విఆర్‌ఒలు రెవెన్యూ సిబ్బంది, నాయకులు, గ్రామస్తులు పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని తెలిపారు.

### వైసిపి నేత భాస్కరరావుకు పరామర్శ

ప్రజాశక్తి - మండపేట

సతీ వియోగంతో బాధపడుతున్న వైసిపి నాయకుడు కొనగళ్ళ భాస్కరరావు ను ప్రముఖ పారిశ్రామిక వేత్తలు, మాధవి ఆయిల్స్ అధినేతలు వేగుళ్ల పట్టాభిరామయ్యచౌదరి, వేగుళ్ల మాధవీ బాబులు గురువారం పమర్శించారు. ముందుగా కొనగళ్ళ సూర్యప్రభ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. భాస్కరరావు కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపం తెలియజేసారు. ఈ పరామర్శలో వైసీపీ నాయకులు మీగడ శ్రీనివాసు, యరమాటి వెంకన్నబాబులు తదితరులున్నారు.

### 8న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - పిఠాపురం

ఈ నెల 8వ తేదీన పట్టణంలోని 12వ అదనపు జిల్లా జడ్జి కోర్టు కాంప్లెక్స్‌లో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ ఎ.వాసంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విచారణలో ఉన్న కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకునే వీలు కక్షిదారులకు కల్పించబడుతుందన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజీ పడతగిన సివిల్, క్రిమినల్, చెక్ బౌన్సు, ఎంవిఐపి, కుటుంబ తగాదాలకు సంబంధించిన కేసులను అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని అన్నారు.

### 15న 'గొల్లప్రోలు' మండల సమవేశం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ఈ నెల 15వ తేదీ ఉదయం10 గంటలకు గొల్లప్రోలు మండల అధ్యక్షులు అరిగెల అచ్చియమ్మ అధ్యక్షతన మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కె.స్వప్న గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపిటిసిలు, జడ్‌పిటిసి, సర్పంచులుతోపాటు, ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

హాజరైన నటుడు కల్యాణ్‌రామ్ తదితరులు

### వివాహ వేడుకల్లో నందమూరి ఫ్యామిలీ సందడి

ప్రజాశక్తి - పి.గన్నవరం

మండలంలోని వాడ్రేవుపల్లి(చాకలిపాలెం) కృష్ణ బాలాజీ కన్వెన్షన్ హాల్ నందు నందమూరి ఆస్థాన సిద్ధాంతి మామిడికుదురు మండలం మొగలికుదురు వాసి కారుపర్తి కోటేశ్వరరావు కుమార్తె వివాహ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో గురువారం సినీనటుడు కళ్యాణ్ రామ్ సందడి చేశారు. కోటేశ్వరరావు, లక్ష్మీ దంపతుల కుమార్తె నాగ ఉషా గాయత్రి, శ్రీ సాయి అఖిల్ వివాహం సందర్భంగా నందమూరి కళ్యాణ్ రామ్, జూనియర్ ఎన్‌టిఆర్ తల్లి, జూనియర్ ఎన్‌టిఆర్ భార్య ప్రణతి కుటుంబ సభ్యులతో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగాఅభిమానులు వారితో సెల్ఫీ లు తీసుకున్నారు.

### నేటి నుంచి సిపిఎం ప్రజా చైతన్యయాత్ర

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజా సమస్యల పరిష్కార కోసం సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన ప్రజా చైతన్య యాత్ర ఈ నెల 7వ తేదీన ప్రారంభం కానుందని సిపిఎం .జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 7వ తేదీ ఉదయం 8 గంటలకు నగరంలోని సుందరయ్య భవన్ నుంచి ప్రారంభమయ్యే సైకిల్ యాత్రలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి సమస్యలను తెలుసుకుంటారని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో పాదయాత్రలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పార్టీ నాయకులు, సభ్యులు ఈ సైకిల్ యాత్రలో పాల్గొని జయప్రదం చేయాలని అయన కోరారు.

### ఉపాధి కల్పన కోసం సర్వే

ప్రజాశక్తి - కాజులూరు

వలసలు లేకుండా ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ సిబ్బందితో సర్వే చేపట్టిందని ఎంపిడిఒ జి,రాంబాబు తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాల్లో ఎందరో ఉపాధి లేక ఉంటున్నారని, వారికి స్వగ్రామంలోనే ఉపాధి కల్పించాలనేది ప్రభుత్వ లక్ష్యంగా ఉందన్నారు. హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో ఉండి 18- 50 సంవత్సరాల మధ్య వయసు వారిని సర్వే ద్వారా గుర్తించి ప్రభుత్వానికి నివేదించనున్నామని అన్నారు. సర్వేలో రిజిస్టర్ అయిన వారికి మాత్రమే ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని అన్నారు. స్త్రీ, పురుషులు చదువుకున్నా..లేకపోయినా రిజిస్టర్ చేయించుకోవచ్చునని అన్నారు. అవకాశాలు బట్టి స్థానికంగానే వారికి శిక్షణ ఇచ్చి శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు.

### వసతుల కల్పనకు కృషి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

కనీస మౌలిక వసతులు అయిన విద్య, వైద్యం, రహదారుల నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. గురువారం రూ.4 కోట్లతో నిర్మించనున్న డిగ్రీ కళాశాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. అనంతరం ఏలేశ్వరంలో సిసి రోడ్లు, డ్రెయినేజ్‌లో పూడిక తీత పనులు, మెయిన్‌రోడ్‌లో హై పవర్ ఎల్ఇడి బల్బుల ఏర్పాటు పనులకు స్వీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి పాలనలో నియోజక వర్గం అభివృద్ధిలో కుంటుపడిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమం తోపాటు, అభివృద్ధి పనులు ముమ్మరంగా ప్రారంభం అయ్యాయని అన్నారు. నియోజకవర్గ సమస్యలను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే నిధులు కేటాయించి పనులు జరిపిస్తున్నా రన్నారు.

## అనుబంధ కమిటీలతో వైసిపి బలోపేతం

ప్రజాశక్తి - పి.గన్నవరం

గ్రామస్థాయిలో అనుబంధ కమిటీల నియామకం ద్వారా వైసిపిని మరింత బలోపేతం చేస్తామని పి.గన్న వరం నియోజకవర్గ కో కన్వీనర్ గన్నవరపు శ్రీనివాస్ అన్నారు. పి.గన్నవరంలో గురు వారం మండల శాఖ అధ్యక్షులు నక్క వెంకటేశ్వరరావు అధ్యక్షతన పార్టీ ఆదేశాల మేరకు అనుబంధ కమిటీల నియామకం కార్యకర్తల సమావేశం జరిగింది. పార్టీలు చురుగ్గా పనిచేస్తున్న వారిని, యువత కమిటీల్లో నియమిస్తున్నామని అన్నారు. పార్టీ పదవులను అలంకారంగా కాకుండా బాధ్యతగా తీసుకోని పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మందపాటి కిరణ్, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు దొమ్మేటి సత్యమోహన్, జిల్లా విద్యార్థి భాగ అధ్యక్షులు మిండుగుదటి శిరీష్, దొమ్మేటి వెంకట శివరామన్, అడ్డగళ్ళ సాయిరాం, పితాని నరసింహా రావు, యన్నబత్తుల ఆనంద్, కుంపట్ల గోపి, మద్దుల వరలక్ష్మి, దొమ్మేటి దుర్గారావు, సాధనల రమేష్, సర్పంచ్ లు కొంబత్తుల ఏసు, వడలి కొండయ్య, ఎంకపిటిసి సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పి.గన్నవరం నియోజకవర్గ వైసిపి కో కన్వీనర్ శ్రీనివాస్

**మహారాజశ్రీ 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు : కాకినాడ**

**E.A.No. 193/2024, E.P.No. 34/2024, O.S.No. 556/2010**

Between:

**వల్లూరి జగన్నాయకులు** ...పిటీషనర్/Dhr

మరియు

**వాసంశెట్టి అప్పారావు, వగైరాలు** ...రెస్పాండెంట్లు/JDR's

**$R_1$ : వాసంశెట్టి అప్పారావు,** S/o. అప్పారావు, డో.నెం. 3-17-44,సింహాద్రి అపార్టుమెంట్స్, ఫస్ట్ ఫ్లోర్, రాధానగర్, అంబేద్కర్ గారి విగ్రహం ప్రక్కన, గొడారిగుంట,కాకినాడ.

**$R_2$ : వాసంశెట్టి మహాలక్ష్మి,** W/o. అప్పారావు, డో.నెం. 3-17-44,సింహాద్రి అపార్టుమెంట్స్, ఫస్ట్ ఫ్లోర్, రాధానగర్, అంబేద్కర్ గారి విగ్రహం ప్రక్కన, గొడారిగుంట,కాకినాడ.

పై నెంబర్ ఎగ్జిక్యుటివ్ అప్లికేషన్ E.A. No. 193/2024 లో మీరు 1 మరియు 2 రెస్పాండెంట్లు అయ్యివున్నారు. శ్రీ కోర్టు వారి నుండి మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. పై నెంబర్ E.A. No. 193/2024 పిటీషన్ ది. **25-3-2025 సం॥తేదిన** వాయిదా అయ్యివున్నది. కావున పైన తెలిపిన కోర్టులో హాజరయ్యి ఆక్షేపణలు తెలియపరచుకోవలెను. లేని యెడల పై నెంబర్ పిటీషన్ తమ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపరచటమైనది.

|| By Court Order ||

**కాకర వెంకటేశ్వరరావు,** అడ్వకేట్
#12-1-40, జవహర్ వీధి, కాకినాడ.
Ph: 0884-2367506, Cell: 9848314081

### సకాలంలో పనులు పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక మున్సిపల్ అతిథిగృహంలో తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్న పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(పాడా) కార్యాలయ పనులను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదేశించారు. గురువారం అధికారులతో కలిసి జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ పిఠాపురం పరిధిలోని ప్రాంతాల అభివృద్ధి చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పాడాను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిందన్నారు. పిఠాపురం, గొల్లప్రోలు, యు.కొత్తపల్లి మండలాల పరిధిలోని గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిస్థాయిలో అమలు లయ్యేలా ఈ వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. ఇందుకు ప్రత్యేక అధికారులను నియమించిందన్నారు. ఈ పర్యటనలో పాడా ఇన్‌ఛార్జ్ పీడీ ఎన్.శ్రీధర్‌బాబు, ఎపీడీ పి.వసంతమాధవి, మున్సిపల్ కమిషనర్ కనకారావు, ఇతర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

### బీచ్‌ను అందుబాటులో తీసుకురావాలి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

నగర పరిధిలోని ఎన్‌టిఆర్ బీచ్ సుందరీకరణ పనులు నెల రోజుల్లో పూర్తిచేసి సందర్శకులకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదేశించారు. గురువారం రూరల్ మండలం సూర్యాపేట - ఎన్‌టిఆర్ బీచ్‌లో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. కాకినాడ సముద్ర తీర ప్రాంతంలో ప్రస్తుతం నిర్వహిస్తున్న వివిధ కార్యకలాపాలు, బీచ్ క్లీనింగ్, నూతనంగా చేపట్టబోయే వివిధ అభివృద్ధి కార్యకలాపాల పురోగతిపై ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. బీచ్ ప్రదేశాలలో నిర్వహిస్తున్న క్లీనింగ్ పనులు సవ్యంగా లేకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో బీచ్ ప్రాంతానికి వచ్చే సందర్శకులు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించేందుకు అనువుగా బీచ్ పరిసరాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దడం జరుగు తుందన్నారు. అధికారులు మరింత దృష్టి సారించి నెల రోజుల్లో పనులను పూర్తిచేసి సందర్శకులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. కాకినాడ బీచ్ పార్క్‌కు వచ్చే సందర్శకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు తగు చర్యలు చేపట్టాలన్నారు. పర్యటనలో ట్రైనీ ఐపిఎస్ సుస్మిత, నగరపాలక సంస్థ ఎస్ఇ కామేశ్వరరావు, జిల్లా పర్యాటకశాఖ అధికారి పసుపులేటి పోశయ్య, అసిస్టెంట్ టూరిజం అధికారి వి.త్రిమూర్తులు, ఎపిటిడిసి ఎఇ వెంకటేష్, కుడా ఇఇ రామారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - కాజులూరు

చట్టాలపై మహిళలు, బాలికలకు అవగాహన అవసరమని ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు కనకరత్నం, మాణిక్యాంబ అన్నారు. గురువారం స్థానిక వినాయక పాఠశాల, గొల్లపాలెం జడ్‌పి పాఠశాలల్లో చట్టాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు, బాలికల కోసం అనేక చట్టాలు ఉన్నాయని, అయితే కొందరి వల్ల ఈ చట్టాలు నిర్వీర్యం అవుతున్నాయన్నారు. కావున మహిళలు, బాలికలు చట్టాలపై అవగాహన తెచ్చుకోవాలని సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు హనుమావతి, అన్నవరం పాల్గొన్నారు.

### పబ్లిక్ నోటీసు

నా క్లయింటు తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం, గాదాలమ్మ నగర్, డోర్ నెం. 88-3-5 కాపురస్తురాలు C.Radha Agrotech Private Limited, Managing Director అయిన చింతలపాటి వెంకట సత్య సూర్య రఘురామరాజు గారి భార్య చింతలపాటి రాధ గారు ఇచ్చిన సంజాయిషీపై యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా,

నా క్లయింటు తన స్వాధీనములో గల ఈ దిగువ ఉదహరించిన దస్తావేజులు తన దగ్గర ఉద్యోగం చేస్తున్న గొట్టుముక్కల సురేష్ కుమార్ రాజు గారికి ఇచ్చి జిరాక్స్ కాపీలు తీయించమని అప్పగించగా, అవి పెద్దాపురం మెయిన్‌రోడ్‌లో గల జిరాక్స్ షాపులో జిరాక్స్ కాపీలు తీయించుకొని వస్తుండగా ఒరిజినల్ దస్తావేజులు పడిపోయినవి. సదరు దస్తావేజులు ఎవరికైన దొరికిన ఎడల నాకు గాని, నా క్లయింటుకు గాని అప్పగించవలసినదిగా కోరుచున్నాను.

***దస్తావేజు వివరములు:***

1. ది. 01-12-2011 సం॥ తేదీన రాజమండ్రి శ్యామలానగర్ కాపురస్తులు బిక్కిన వీరాస్వామి, బిక్కిన ఉషారాణి నా క్లయింటు చింతలపాటి రాధ గారికి తూర్పుగోదావరి జిల్లా, రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, డోర్ నెం. 88-3-5 కు సమీపంలో గల R.S. No. 365, 366, 367 లో గల ఫ్లాట్ నెంబరులు 29, 30 కు సంబంధించి వ్రాసిన రాజమండ్రి సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ క్రియ దస్తావేజు నెం. 7034/2011.
2. ది. 23-5-1985 సం॥ తేదీన పై ఉదహరించిన ఆస్తికి సంబంధించి బిక్కిన వీరాస్వామి వగైరాలకు అంగిటిపల్లి సీతారామ రెడ్డి గారు రాజమండ్రి సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో దస్తావేజు నెం. 4774/1985 గా వ్రాసి ఇచ్చిన క్రియ దస్తావేజు.

**వేదుల సుబ్రహ్మణ్యం, అడ్వకేట్**
**పెద్దాపురం, సెల్: 9052699989**